క్లుప్తంగా

సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టం

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి



దుస్తులు పంపిణీ చేస్తున్న ఆర్ఐ రాజిరెడ్డి

పెద్దేముల్: పేదలకు సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టమని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులకు ఆయన సొంత ఖర్చుతో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ.. ప్రతీ ఏటా విజయదశమి(దసరా) పండుగకు పేదలకు వస్త్ర దానంతో పాటు నిరుపేదలకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్నానన్నారు.

అవకాశం ఇస్తే 'గ్యారెంటీ'ల అమలు

యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అమేర్ అబ్దుల్లా



అగ్గనూరులో ప్రచారం చేస్తున్న అమేర్ అబ్దుల్లా

యాలాల: పేద, మధ్యతరగతి పక్షపాతి అయినా కాంగ్రెస్‌కు ఒక్క చాన్స్ ఇచ్చి చూడాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అమేర్ అబ్దుల్లా ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని అగ్గనూరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేసి చూపుతామన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత పేరిట చేపట్టనున్న పథకాలను వివరించారు. తాండూరు అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి ఆశావహుల్లో తాను సైతం ఉన్నానని, అవకాశం ఇస్తే సేవ చేసి చూపిస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు షకూర్, నరేందర్, బబ్లూ, అబ్దుల్ రెహమాన్, ముజాహిద్ ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



పుట్టపహాడ్‌లో నూనె గానుగను ప్రారంభిస్తున్న అధికారులు

కుల్కచర్ల: మహిళలు ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలని ఏపీడీ నర్సింలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పుట్టపహాడ్ గ్రామంలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూనె గానుగ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళ సంఘాల ద్వారా లబ్ధి పొందిన మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రణాళికాయుతంగా ముందుకుసాగాలన్నారు. మహిళా సమాఖ్య ద్వారా బ్యాంకులలో రుణాలు పొందిన లబ్ధిదారులు సకాలంలో వాటిని చెల్లించి ఆర్థికస్వావలంబనను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం వీరయ్య, రామ్మూర్తి, శ్రీనివాస్, నర్సింలు, ఏపీఎం శోభ, స్థానిక సర్పంచ్ చిల్ల అంజిలమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

బొంరాస్‌పేట: బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని వివరించారు. బొంరాస్‌పేట మండలంలోని మెట్లకుంట, ఏర్పుమళ్ల, దుద్యాల మండలాల్లోని పోలెపల్లి తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విస్తృతంగా వివరించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజాసంక్షేమం తప్పక సాధ్యమవుతుందన్నారు. ఇందులో మండల నాయకులు జయకృష్ణ, నర్సింలు నాయుడు, దుద్యాల మండల కాంగ్రెస్ నాయకులు సీసీ వెంకటయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

దోమ: పేదలకు నిరంతరం అండగా ఉంటామని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బొంపల్లిలో పట్నం రాములు గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వారు స్థానికులకు అంత్యక్రియల కోసం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ గందెరాములు, రిటైర్డ్ ఏఎస్ఐ అంతిరెడ్డి, గ్రామ సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి రాములు, షెర్‌ఖాన్, పవన్‌యాదవ్, లోకేశ్‌యాదవ్, ప్రవీణ్ యాదవ్, బాల్‌రాజ్, గుడిసెబాబు, ముద్దం వెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో అంధకారం

34 వార్డుల్లో కమ్ముకున్న చీకటి

- కొత్త లైట్లు సరఫరా చేయరు.. పాత వాటిని మరమ్మతు చేయరు
- ఉన్నవాటితో నెట్టుకొస్తున్న సిబ్బంది



వీధి దీపాలు లేక చీకటిగా మారిన ఓ కాలనీ

వికారాబాద్ అర్బన్: పండుగ రోజుల్లోనూ గ్రామాలు అంధకారంలోనే మగ్గుతున్నాయి. ఓ వైపు నవరాత్రి ఉత్సవాలు.. మరో వైపు బతుకమ్మ వేడుకలు జరుగుతున్నా వీధిలైట్లు వెలగడం లేదు. చీకట్లోనే సంబురాలు సాగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ ఇదే దుస్థితి. 34 వార్డుల్లో ఒక్క కొత్త ఎల్‌ఈడీ బల్బు ఏర్పాటుకు నోచుకోలేదంటే పరిస్థితి ఇట్టే అర్థమయితుంది. జిల్లా కేంద్రంతోపాటుగా ప్రధాన రోడ్లు, శివారు రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈఈఎస్ఎల్(ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్) సంస్థ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలతో విద్యుత్ లైట్ల నిర్వహణకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఎల్‌ఈడీ లైట్ల బిగింపుతో పాటుగా నిర్వహణ బాధ్యత సంస్థదే. కానీ సదరు సంస్థ నిర్వహణ గాలికొదిలేసింది. మున్సిపల్ కమిషనర్, డీఈలు ఫోన్లు చేసినా స్పందన కరువైంది.

నెలకు రూ.5.50లక్షలు చెల్లింపు

వీధి లైట్ల నిర్వహణ, మరమ్మతులకు ప్రతీ నెల రూ.5.50లక్షలు మున్సిపల్ పాలకవర్గం చెల్లిస్తోంది. కానీ ఏడాది నుంచి ఒక్క నూతన బల్బు ఏర్పాటు చేయలేదు. బతుకమ్మ, శరన్నవరాత్రుల సందర్భంగా ప్రజలంతా ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల ప్రచారం సైతం చీకట్లోనే సాగుతోంది. ఇబ్బందులను సదరు సంస్థకు తెలిపినా స్పందన కరువవ్వడంతో కొన్ని చోట్ల మున్సిపల్ సిబ్బంది పాత లైట్లను సరిచేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ ఫోన్లతో పాటుగా ఉత్తరాలు రాసినా పట్టించుకోవడం లేదని సమాచారం. ఇటీవల మున్సిపల్ సాధారణ సమావేశంలోనూ పాలకవర్గం దాదాపు 150 ఎల్‌ఈడీ లైట్లు. ఇతర వీధి దీపాలు మరో 200 కావాలని తీర్మణం చేసినా నేటికీ సంద్పన రవాడం లేదని ఆరోపించారు. కాగా రెండు, మూడ నెలలుగా మున్సిపల్ సిబ్బంది బిల్లులు చెల్లించకపోవడంతేనే సంస్థ నుంచి స్పందన లేదని ప్రచారం సాగుతోంది.

పాతవాటికే మరమ్మతులు

వార్డుల్లో విద్యుత్ లైట్లు మరమ్మతుకు చేరినా.. కొత్తవి బిగించాల్సి వచ్చినా.. పాత వాటిని తొలగించాలన్నా సదరు సంస్థ సిబ్బందే చేయాలి. అందుకు ముగ్గురు నుంచి నలుగురు వరకు సంస్థ వేతనం ఇచ్చి పెట్టుకోవాలి. కానీ సదరు సంస్థ సిబ్బందిని పెట్టుకోలేదు. దీంతో మున్సిపల్‌లోని విద్యుత్ విభాగానికి చెందిన సిబ్బందే ఈ పనులు చేసిస్తున్నారు. కొత్తగా విద్యుత్ లైట్ల సరఫరా లేక పోవడంతో పాత వాటినే రెండు మూడు సార్లు మరమ్మతులు చేశారు. దసరా వేడుకలు ప్రారంభం కావడంతో తమ వార్డుల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని వినతులు భారీగా పెరిగాయి. శివారు గ్రామాలను మున్సిపల్‌లో విలీనం చేశాక విద్యుత్ లైట్ల ఏర్పాటు సమస్య మరింత పెరిగింది. మద్గుల్ చిట్టంపల్లి, గురుడుపల్లి, ధన్నారం, బూర్గుపల్లి, గెరిగెట్‌పల్లి వంటి శివారు గ్రామాల్లో పరిస్థితి దయనీయంగా ఉంది. సాయంత్రం 6గంటల దాటితే ప్రజలు బయటకు రాలేక పోతున్నారు.

మెయిన్ రోడ్డుకే లైట్లు లేవు



పట్టణంలోని మెయిన్ రోడ్డు లైట్లే సరిగ్గా వెలగడం లేదు. కొన్నిచోట్ల రోడ్డు చీకటిగా ఉంది. పట్టణం కంటే ఊరే నయం. వెనుక ముందు వాహనాలు వేగంగా వస్తుండటంతో చీకట్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పండుగ సందర్భంగా రాత్రి 10గంటల వరకు జనాలు బయటే ఉంటున్నారు. గతంలో చౌరస్తాల్లో ఎల్‌ఈడీ లైట్లు ఉండేవి. అవి కూడా కనుమరుగయ్యాయి.

– స్థానికుడు

ఉన్నతాధికారులకు ఫిర్యాదు



నేను బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి సంస్థ ప్రతినిధులకు ఫోన్లు చేస్తున్నా స్పందించడం లేదు. ఇదే విషయంపై లెటర్లు రాశాను. ఇటీవలే మా డీఈ ఫోన్లో మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో కొన్ని లైట్లు వచ్చే అవకాశం ఉంది. వీటి నిర్వహణను సంస్థ మరించింది. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం. ప్రతీ నెల మెయింటనెన్స్ చెల్లిస్తున్నాం. మున్సిపల్ సిబ్బందితోనే పాత వాటిని మరమ్మతు చేసి ఏర్పాటు చేస్తున్నాం. సుమారు 500 కొత్త ఎల్‌ఈడీ లైట్లు కావాలని సీఎండీఈకు వినతులు పంపించాం.

– జాకీర్ అహ్మద్ , వికారాబాద్ మున్సిపల్ కమిషనర్

సరస్వతీ నమస్తుభ్యం

దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు సరస్వతీ దేవి అలకంరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆయా మండపాలు, ఆలయాల్లో చిన్నారుల చేత ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు కుంకుమార్చన చేశారు.

– వికారాబాద్ నెట్‌వర్క్



పెద్దేముల్: సరస్వతి దేవి అవతారంలో తుల్జామాత



అనంతగిరి: సామూహిక కుంకుమార్చనలో మహిళలు



మోమిన్‌పేట: మొరంగపల్లిలో..



కొడంగల్ రూరల్: అన్నారం గ్రామంలో పూజలో పాల్గొన్న సర్పంచ్ అనిత

కంది పంటకు ఎండు తెగులు

పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



పంట వివరాలు నమోదు చేసుకుంటున్న శాస్త్రవేత్త రాజేశ్వర్‌రెడ్డి

ధారూరు: వ్యవసాయశాఖ ద్వారా పంపిణీ చేసిన పీఆర్‌జీ–176 రకం కందిని విత్తిన రైతుల పంట ఎండిపోతున్నాయి. దీంతో శుక్రవారం తాండూరు వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త రాజేశ్వర్‌రెడ్డి ఏఓ ఝాన్సీలక్ష్మితో కలిసి పరిశీలించారు. ధారూరు వ్యవసాయ క్లస్టర్ పరిధిలోని అవుసుపల్లి శివారులో నర్సయ్య సాగుచేసిన పీఆర్‌జీ 176 రకం కంది పంటను పరిశీలించారు. ఎండు తెగులు(వేరుకుళ్ల తెగులు) సోకి ఎండుతున్నట్లు గుర్తించారు. ఎండిన కంది మొక్కల కాండాన్ని, మట్టిని సేకరించిన శాస్త్రవేత్త భూసార పరీక్షలకు తీసుకెళ్లారు. పంట కాలంలో వాడిన ఎరువులు, క్రిమి సంహారక మందులు, సాగుచేసిన పంట కాలం వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఒక్క రైతు పొలంలోనే కంది మొక్కలు ఎండిపోయాయా..? లేక ఇతర రైతుల పొలాల్లోనూ సోకిందా అని ఏఓను అడిగి తెలుసుకున్నారు. ఎండు తెగులు సోకడానికి కారణాలు, సస్య రక్షణ చర్యలపై పరీక్షల అనంతరం నివేదికను జిల్లా వ్యవసాయ అధికారికి పంపనున్నట్లు శాస్త్రవేత్త రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాట్ సెంటర్ కోఆర్డినేటర్ లక్ష్మయ్య, ఏఈఓ సంజూరాథోడ్, రైతులు పాల్గొన్నారు.

పల్లెలన్నీ కాంగ్రెస్ వెంటే

పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్



కాంగ్రెస్‌లో చేరుతున్న కార్యకర్తలు

కుల్కచర్ల: పల్లెలన్నీ కాంగ్రెస్‌తోనే ఉండనున్నాయని పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కొత్త ఉమాపతి రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు చేకూరుతుందన్నారు. అవినీతి పాలనను అంతమొందించేందుకు ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు నరసింహ నాయక్, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే 'సౌభాగ్య లక్ష్మి'



ఎన్నికల ప్రచారంలో గఫార్

పార్టీ పట్టణ అధ్యక్షుడు గఫార్

మర్పల్లి: బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సౌభాగ్య లక్ష్మి పథకం కింద నెలకు రూ.3వేలు, రూ.400కే గ్యాస్ సిలెండర్ అందజేయనుందని బీఆర్‌ఎస్ టౌన్ ప్రసిడెంట్ గఫార్, పెద్దాపూర్ మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వారు మండల పరిధిలోని పెద్దాపూర్, మర్పల్లి, పట్లూర్, ఘణాపూర్ గ్రామాలలో ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు పబ్బే సుధాకర్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యాక్షుడు రమేష్‌మిత్ర, పట్లూర్ అశోక్, రావులపల్లి ఎంపీటీసీ రవి, మార్కెట్ డైరక్టర్ గౌస్, సహకార సంఘం డైరక్టర్ పెద్దాపూర్ యాదయ్య, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఘణాపూర్ మాజీ సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ బిచ్చయ్య, ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

మోమిన్‌పేట: మండల పరిధిలోని కేసారం, కాస్లబాదు, కాస్లబాదు తండా, గోవిందాపూర్ గ్రామాలలోని బీఎస్పీ, కాంగ్రెస్ నుంచి కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు, డి.వెంకట్, మండల యువత అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టరు మెతుకు ఆనంద్ సమక్షంలో పార్టీలో చేరారు. కలిసి కట్టుగా పనిచేసి మరోసారి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకువద్దామని ఎమ్మెల్యే ఆనంద్ సూచించారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే ఆనంద్

ఆటపాటలతో బతుకమ్మ

బతుకమ్మ సంబురాలు ఘనంగా కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో మహిళలు, ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది, కళాశాలలు, ఇనిస్టిట్యూట్‌లో విద్యార్థులు బతుకమ్మలు పేర్చి గౌరీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బతుకమ్మలను ఒక్క చోట చేర్చి ఉయ్యాల పాటలు పాడుతూ ఆడారు.

– వికారాబాద్ నెట్‌వర్క్



మోమిన్‌పేట: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



అనంతగిరి: డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో..



అనంతగిరి: మద్గుల్ చిట్టంపల్లిలో..



కొడంగల్ రూరల్: వీబీఆర్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ విద్యార్థినులు




పూడూరు: సోమన్‌గుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో..

ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు

మర్పల్లి ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి

మర్పల్లి: పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా విద్యార్థులకు, పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు మర్పల్లి ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు ప్రతీ మండల కేంద్రంలో ఆన్‌లైన్ విధానంలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్ విద్యార్థులకు, పోలీస్ సిబ్బందికి 'సమర్థవంతమైన పోలీసింగ్ విధానం–సాంకేతిక పరిజ్ఞానం వినియోగం' రెండో కేటగిరీలో 'సోషల్ మీడియా దుర్వినియోగం అరికట్టడంలో పోలీస్ పాత్ర' అనే అంశాలపై పోటీలుంటాయన్నారు. వివరాలకు సమీప పీఎస్ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

బీజేవైఎంకు టౌన్ అధ్యక్షుడి రాజీనామా



సాయి కృష్ణ గౌడ్

అనంతగిరి: బీజేవైయం వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సాయికృష్ణ గౌడ్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో వికారాబాద్ నియోజవర్గ దృష్ట్యా మనం ముందుకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఇన్నాళ్లు తనకు సహకరించిన యువ నాయకులకు, పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. ఏ పార్టీలో చేరేది త్వరలో నిర్ణయం తీసుకుంటానన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

- అధికారుల గైర్హాజరు
- ఆగ్రహం వ్యక్తి చేసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

పెద్దేముల్: అధికారులు గైర్హాజరుతో పెద్దేముల్ మండల పరిషత్ సమావేశం రసాభాసగా మారింది. ఎంపీపీ అనురాధ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ.. అధికారులు లేకుండా సమావేశం ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా సమావేశాలు నిర్వహిస్తున్నా గ్రామాల్లో ఒక్క పని అమలుకు నోచుకోలేదన్నారు. ఏఓ నజీరుద్దీన్ మాట్లాడుతూ 37 మంది రైతులకు రైతుబంధు జమకాలేదన్నారు. విద్యుత్ శాఖ అధికారి మాట్లాడుతుండగా రేగొండి సర్పంచ్ హైదర్ కల్పించుకుని గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి 20 రోజులైనా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్ విద్యుత్ ఏడీతో ఫోన్‌లో మాట్లాడి రెగోండి విద్యుత్ సమస్య లేకుండా చుస్తానన్నారు. అడ్కిచెర్ల–తట్టెపల్లి రోడ్డు పనులపై ప్రశ్నించగా అధికారి సమాధానం ఇవ్వలేదు. దీంతో ఆయనపై జెడ్పీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరెంట్ టీచర్ మీటింగ్స్ ఎందుకు నిర్వహించడం లేదని ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ ఎంఈఓపై మండిపడ్డారు. పాషాపూర్ పాఠశాల నుంచి నిత్యం ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పై పంపిస్తే బోధన ఎలాసాగుతుందని సర్పంచ్ భరత్ ప్రశ్నించారు. మంబాపూర్, పెద్దేముల్‌లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని, ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన లాభం లేదని వెంటనే నీటి సమస్య తీర్చాలని మంబాపూర్ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ కోరారు. అనంతరం ఎంపీపీ అనురాధ, జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్ మాట్లాడుతూ.. సమాధానం ఇచ్చే అధికారులే సమావేశానికి వచ్చేలా చూడాలని ఎంపీడీఓ లక్ష్మప్పను కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ మధులత, ఎంపీడీఓ లక్ష్మప్ప, ఆర్ఐ రాజిరెడ్డి, ఏఈలు సిద్ధార్థ, హకీల్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాసిరకంగా బీటీ రోడ్డు

పట్టించుకోని అధికారులు

పూడూరు: మండల పరిధిలోని కడుమూరు గ్రామానికి వేస్తున్న బీటీ రోడ్డు పనులు నాసిరకంగా చేపడుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు రోడ్డు వేస్తుండగా మరో వైపు కంకర తేలిపోతుందన్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని ఆరోపించారు. పదేళ్లుగా రోడ్డు లేక ఇబ్బందులు పడ్డామని.. ఇప్పుడు వేసే రోడ్డు సైతం నాణ్యత లోపించడంతో ఉపయోగం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టి నిధులు దుర్వినియోగాన్ని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.